ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
శనివారం 27 జనవరి 2024



జెండావందనం చేస్తున్న గవర్నర్, ముఖ్యమంత్రి తదితరులు



కనులపండువగా గణతంత్ర వేడుకలు

- సేవాపరులకు అవార్డుల ప్రదానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పరేడ్‌లో జల్లికట్టు స్టేడియం శకటం
- గవర్నర్‌తో స్టాలిన్ కబుర్లు

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మెరీనాబీచ్‌లో భారత 75వ గణతంత్ర వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎం స్టాలిన్, గవర్నర్ ఆర్ఎన్ రవి కలివిడిగా ఉండడం విశేషం. తొలుత త్రివిధ దళాలు, రాష్ట్ర పోలీసు శాఖలోని వివిధ విభాగాల సభ్యులు, కమెండో, మహిళా పోలీసు దళం సభ్యుల కవాతు, ఆ తర్వాత విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, చివరగా శకటాల ఊరేగింపు కనువిందు చేశాయి. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ రవి సతీసమేతంగా విచ్చేశారు. సీఎం స్టాలిన్, మంత్రి వర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం ఉదయం 7.52 గంటలకు విచ్చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఆయనకు స్వాగతం పలికారు. ఆ తర్వాత గవర్నర్ ఆర్ఎన్ రవి సతీమణి లక్ష్మీరవితో పాటు ఉదయం 7.55 గంటలకు విచ్చేశారు. స్టాలిన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అటు పిమ్మట స్టాలిన్ త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులను, డీజీపీ శంకర్‌జివాల్, నగర పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, ఏడీజీపీ అరుణ్ తదితరులను పరిచయం చేశారు. ప్రత్యేక గ్యాలరీలో ఏర్పాటు చేసిన వేదికపైకి తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత గవర్నర్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా పతాక స్తంభం ప్రాంతానికి చేరుకున్నారు. ఉదయం 8 గంటలకు గవర్నర్ రవి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముగ్గురు జాతీయ పతకానికి సెల్యూట్ చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న నేతలు

ఆ సమయంలో హెలికాప్టర్ నుండి పుష్పవర్షం కురిపించారు. ఈ సందర్భంగా సైనికదళం, వైమానిక దళం, ఆ రెండు దళాల సంయుక్త బ్యాండ్ వాయిద్యదళం సభ్యుల కవాతు ప్రారంభమైంది. ఆ తర్వాత త్రివిధ దళాలకు చెందిన సభ్యులు కవాతు నిర్వహించారు. కేంద్ర రిజర్వు దళం, రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళం, విపత్తుల నిర్వహణం బృందం, ప్రత్యేక కమెండోల దళం సభ్యులు వరుసగా నిర్వహించిన కవాతు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆ సందర్భంగా గవర్నర్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ పరస్పరం నవ్వుతూ ఏదో విషయమై కబుర్లాడుకున్నారు. రాష్ట్ర అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, ఎన్‌సీసీ విభాగం సహా మొత్తం 41 బృందాలకు చెందిన సభ్యులు వరుసగా కవాతు నిర్వహించి ప్రేక్షకులను మైమరపించారు. అనంతరం కల్తీసారా నిరోధానికి పాటుపడిన పోలీసు అధికారులకు, తూత్తుకుడి, తిరునల్వేలి వరద బాధితులను కాపాడటంలో ధైర్య సాహసోపేతాలు ప్రదర్శించిన ముగ్గురికి అన్నా శౌర్యపతకాలు, మతసామరస్యతా అవార్డు నారాయణస్వామి అవార్డును, పతకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం తర్వాత వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ఊరేగింపు ప్రారంభమైంది. తొలుత సమాచార శాఖ శకటం, ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ మదురై అలంగనల్లూరు వద్ద ప్రారంభించిన జల్లికట్టు మైదానాన్ని తలపించే విధంగా రూపొందించిన శకటం, రాష్ట్ర క్రీడాశాఖ ఖేలో ఇండియా పోటీలను ప్రదర్శించేలా తయారు చేసిన శకటం, పోలీసు శాఖ సహకార, మహిళా సంక్షేమ శాఖ, ప్రజారోగ్యశాఖ, అగ్నిమాపక శాఖలకు చెందిన శకటాలు వరుసగా ఊరేగించారు. ఈ ఊరేగింపుతో గణతంత్ర వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో స్పీకర్ అప్పావు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గంగాపూర్‌వాలా, వివిధ దేశాలకు చెందిన రాయబారులు తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత గాంధీని కించపరుస్తారా?

- మీరేమైనా గాడ్సేకు చెందినవారా?
- గవర్నర్‌పై కనిమొళి ఆగ్రహం



పెరంబూర్, జనవరి 26: దేశ జాతిపిత గాంధీ కాదని, సుభాష్ చంద్రబోస్ అంటూ ఇటీవల గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన వ్యాఖ్యలపై డీఎంకే లోక్‌సభ సభ్యురాలు కనిమొళి స్పందించారు. 'స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్‌ను ప్రశంసించడం తప్పు కాదు. అదే సమయంలో జాతిపిత అయిన గాంధీని కించపరచేలా మాట్లాడడమేంటి... మీరేమైనా గాడ్సేకు చెందినవారా?' అంటూ గవర్నర్‌ను కనిమొళి ప్రశ్నించారు. తెన్‌కాశిలో ఆమె భాషోద్యమకారుల సంస్మరణ సభలో మాట్లాడుతూ... అయోధ్య రామాలయ కార్యక్రమానికి వెళ్లరాదని, ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయరాదని డీఎంకే ప్రభుత్వ నిర్బంధించినట్లు ఆరోపించడం సరికాదన్నారు. దేవుడిపై నమ్మకం ఉన్నా, లేకున్నా ఆలయాలు, భక్తుల భద్రతకు రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. డీఎంకే ప్రభుత్వ హయాంలోనే అన్ని ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించడం ఇందుకు నిదర్శనమన్నారు. బోస్ అంటే రాష్ట్రప్రజలకు ప్రత్యేక అభిమానం ఉందని, ఆయన చరిత్ర ఎల్లప్పుడూ స్మరించుకుంటూ నివాళి అర్పిస్తుంటారని అన్నారు.

ఇతర దేశాల్లో అయితే జైల్లో పెట్టేవారు
కాంగ్రెస్ సీనియర్ నేత పీటర్ అల్ఫోన్స్

జాతిపిత గాంధీపై రాష్ట్ర గవర్నర్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇతర దేశాల్లో అయితే జైల్లో పెట్టేవారని కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర మైనార్టీల సంఘం అధ్యక్షుడు పీటర్ అల్ఫోన్స్ విమర్శించారు. శుక్రవారం ఆయన చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ.. మహాత్మాగాంధీని జాతిపిత కాదని గవర్నర్ చెప్పడం గర్హనీయమన్నారు. రామరాజ్యం అందిస్తున్నామంటూ ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించడం ఇందులో భాగమేనా అని ప్రశ్నించారు. వచ్చే రిపబ్లిక్‌డే వేడుకల నాటికి మహాత్మాగాంధీ కోరుకున్న రాజ్యం రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఏర్పడడం ఖాయమని పీటర్ చెప్పారు.

డీఎంకే పాలనలో 40 శాతం పెరిగిన ధరలు

- క్షీణించిన శాంతిభద్రతలు
- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి



పెరంబూర్, జనవరి 26: డీఎంకే పాలనలో నిత్యావసర సరుకుల ధరలు 40 శాతం పెరిగాయని, అదే సమయంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) విమర్శించారు. సేలం ముల్లమపుంపట్టిలో శుక్రవారం డీఎంకే, పీఎంకే, డీఎండీకే సహా పలు పార్టీలకు చెందిన సుమారు 1,000 మంది ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నాడీఎంకే 30 ఏళ్ల పాలనలో ఉన్నత విద్యలో తమిళనాడు దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రజలు, కార్యకర్తల కన్నా డీఎంకే నేతలకు వారసత్వ రాజకీయాలు కావాలన్నారు. కరుణానిధి సభలో స్టాలిన్, స్టాలిన్ సభలో ఉదయనిధి, తాజాగా సేలంలో ఉదయనిధి సభలో ఆయన కుమారుడు ఇన్బనిధి పాల్గొన్నారని, వారసత్వ రాజకీయాలకు ఇదొక ఉదాహరణ అని ఎద్దేవా చేశారు. డీఎంకే రెండు సంవత్సరాల 8 నెలల కాలంలో కొత్త పథకాలు చేపట్టలేదని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పళనిస్వామి అన్నారు.

వరద బాధితుల్ని ఆదుకున్న ముగ్గురికి అన్నా శౌర్యపతకాలు

రైతు బాలమురుగన్‌కు నారాయణస్వామి అవార్డు

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్ రెండో వారంలో తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో సంభవించిన వరదల్లో ప్రాణాలకు తెగించి బాధితులను కాపాడిన శ్రీవైకుంఠం తహసీల్దార్ సహా ముగ్గురికి అన్నా శౌర్య పతకాలను సీఎం స్టాలిన్ బహూకరించారు. యేటా ప్రభుత్వ ఆధ్వర్యంలో వీరోచిత, ధైర్యసాహసాలను ప్రదర్శించే ప్రభుత్వ ఉద్యోగులు, పౌరులను ఎంపిక చేసి గణతంత్ర దినోత్సవం సందర్భంగా వారికి అన్నా శౌర్య పతకాలను ప్రదానం చేసి సత్కరించడం ఆనవాయితీ. ఈ పతకానికి ఎంపికైనవారికి రూ.లక్ష నగదు, రూ.9వేల విలువైన బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని బహూకరిస్తారు.ఈ యేడాది అన్నా పతకాలకు ఎంపికైన శ్రీవైకుంఠం తహసీల్దార్ శివకుమార్, కాయల్‌పట్టినంకు చెందిన యాసర్ అరాఫత్, తిరునల్వేలికి చెందిన డేనియల్‌ను సీఎం సత్కరించారు. రూ.లక్ష చెక్కు, పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

తహసీల్దార్ శివకుమార్...

తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో గత డిసెంబర్ 17, 18 తేదీల్లో కుండపోత వర్షాలు కురిసిన పుడు తామ్రభరణి వాగులో వరదలు సంభవించి పలు ప్రాంతాలు నీటమునిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో శ్రీవైకుంఠం తాలూకాలో తామ్రభరణి వాగుకు 500 మీటర్లకు చేరువగా ఉన్న 14 గ్రామాలకు చెందిన ప్రజలను తహసీల్దార్ శివకుమార్ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాత్రిపూట ప్రతి ఇంటి వద్దకు వెళ్లి హెచ్చరిస్తూ వారిని వివిధ వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద ముంచెత్తే లోగా సుమారు 2400 మందిని ఆయన కాపాడారు. పెనుముప్పునుండి ప్రజలను సకాలంలో కాపాడినందుకుగాను తహసీల్దార్ శివకుమార్‌కు అన్నా పతకం ప్రదానం చేశారు.

జాలరి యాసర్ అరాఫత్...

తూత్తుకుడి జిల్లాలో గత డిసెంబర్ రెండో వారంలో వర్షబీభత్సం కారణంగా సింగితురై ప్రాంతానికి చెందిన యాసర్ అరాఫత్ అనే జాలరి నాయకత్వంలో 16 మంది జాలర్లు బృందంగా ఏర్పడి తిరుచెందూరు సమీపం తన్నీర్‌పందల్‌లో నీటిలో కొట్టుమిట్టాడుతున్న సుమారు 250 మందిని ప్రాణాలకు తెగించి కాపాడి ఒడ్డుకు చేర్చారు. యాసర్ అరాఫత్ సేవలను గుర్తించి ఆయనకు అన్నా పతకం ప్రదానం చేశారు.

డేనియల్ సెల్వ సింగ్...

తిరునల్వేలిలో గత డిసెంబర్ 18, 19 తేదీల్లో వరదలలో చిక్కుకుని ఇంటిపట్టునే అన్నపానీయాలు లేకుండా బాధపడుతున్నవారికి సకాలంలో సహాయాలు అందించిన డేనియల్ సెల్వసింగ్‌కు అన్నా పతకం బహూకరించారు. డేనియర్ నడములోతు నీటిలో ఈదుకుంటూ వెళ్లి జలదిగ్బంధంలో చిక్కుకున్న స్థానికులకు పాలప్యాకెట్లు, రొట్టెలు, మందులు, తినుబండారాలను మూడు పూటల అందించిన డేనియల్ సేవలను ముఖ్యమంత్రి ప్రశంసించారు.

రైతు బాలమురుగన్‌కు రూ.5లక్షల అవార్డు...

ప్రభుత్వ ప్రతిపాదిత సూచనలు, సాంకేతిక పద్ధతుల ప్రకారం అధిక దిగుబడి సాధించే రైతుకు ఇచ్చే నారాయణస్వామినాయుడి అవార్డుకు ఈ యేడాది సేలం జిల్లా పూలాంబట్టికి చెందిన సి.బాలమురుగన్ ఎంపికయ్యారు. గణతంత్ర వేడుకల్లో బాలమురుగన్‌ను ముఖ్యమంత్రి ఈ అవార్డు కింద రూ.5లక్షల నగదు, పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు.

మదురై పోలీసుస్టేషన్‌కు ట్రోఫీ

రాష్ట్రంలో అత్యుత్తమ పోలీసుస్టేషన్‌గా మదురై జిల్లా ఎస్ఎస్ కాలనీ పోలీసుస్టేషన్ ఎంపికైంది. ఆ పోలీసుస్టేషన్ ఎస్ఐ భూమినాథన్‌కు ముఖ్యమంత్రిట్రోఫీని అందజేశారు. ఇక నామక్కల్, పాళయంకోట పోలీసుస్టేషన్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

ఐదుగురు పోలీసులకు గాంధీ పతకాలు...

రాష్ట్రంలో సారా నిరోధించడంలో కృషి చేసిన విల్లుపురం ఎస్పీ సంగాయ్ సహా ఐదుగురు పోలీసులకు సీఎం స్టాలిన్ గాంధీ పతకాలను బహూకరించారు. ఈ ఐదుగురికి తలా రూ.40వేలు, పతకం, ప్రశంసాపత్రం అందించారు. విల్లుపురం ఎస్పీ సంగాయ్ తిరుప్పూరులో పనిచేస్తున్నప్పుడు సారా నిరోధక చర్యలు చేపట్టి 9742 కేసులు నమోదు చేసి 9822 మంది నేరస్థులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న 140 వాహనాలను వేలం వేసి వచ్చిన రూ.32లక్షలకు పైగా నగదును ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. ఆ తర్వాత విల్లుపురంలోను సారా నిరోధక చర్యలు చేపట్టి ఇప్పటివరనకూ 843 మందిని అరెస్టు చేశారు. అంతే కాకుండా పాఠశాలలు, కళాశాలల వద్ద సారా నిరోధక అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. 250 గ్రామాల సారా లేని గ్రామాలుగా తీర్చిదిద్దారు. ఇదే విధంగా అక్రమ మద్యం రవాణాకు సంబంధించి కీలకమైన సమాచారాన్ని సేకరించి అందించడంలో ప్రతిభ చూపిన, మైలాడుదురై, పుదుకోట, దిండుగల్ జిల్లాల్లో కల్తీసారాను నిరోధించడంలో సేవలందించిన చెన్నై సౌత్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ కాశివిశ్వనాథన్‌కు, మాదక ద్రవ్యాలను నిరోధించడానికి కఠిన చర్యలు చేపట్టిన రెడ్‌హిల్స్ ఎక్సైజ్ సీఐ మునియసామికి, మదురై ఇంటెలిజెన్స్ విభాగం ఎస్ఐ పాండ్యన్‌కు, రాణిపేట సెంట్రల్ ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ రంగనాథన్‌కు అన్నా పతకాలు బహూకరించి సత్కరించారు.

మహమ్మద్ జుబేర్‌కు మత సామరస్య అవార్డు

గణతంత్ర వేడుకల్లో కృష్ణగిరి జిల్లా డెంకణికోట తాలూకా తళిలో నివసిస్తున్న మహమ్మద్ జుబేర్‌ను సీఎం స్టాలిన్ 'కోట్టై అమీర్' స్మారక మతసామరస్య అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డు కింద రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. మహమ్మద్ జుబేర్ 'ఆల్ట్ న్యూస్' పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించి సోషల్ మీడియాలో మతచిచ్చును రగిల్చేలా వచ్చే అసత్య వార్తలను పసిగట్టి వాటిని అసత్యాలంటూ రుజువు చేస్తూ వచ్చారు. గత యేడాది రాష్ట్రవ్యాప్తంగా ఉత్తరాది కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ వచ్చిన అసత్యపు వార్తలను మహమ్మద్ జుబేర్ నకిలీవని తేల్చారు. అంతటితో ఆగకుండా అంతర్జాలంలో వెలువడిన వీడియోలు ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన పాత సంఘటనలకు సంబంధించినవని సాంకేతిక పద్ధతుల ద్వారా నిరూపించారు.



అన్నా శౌర్య పతకాలు, గాంధీ పతకాలు పొందినవారితో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా

బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యానికి శాశ్వత సమాధి

- కార్పొరేషన్లుగా మారనున్న రాష్ట్రాలు
- ఇండియా కూటమికే అధికారం తథ్యం
- డీపీఐ మహానాడులో సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని శాశ్వతంగా సమాధి కట్టేస్తారని, రాష్ట్రాలన్నీ అధికారాలు లేని కార్పొరేషన్లుగా మారిపోతాయని, ఈ పెనుముప్పు నుంచి దేశాన్ని కాపాడాలంటే ఇండియా కూటమి గెలిచి తీరాలని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తిరుచ్చి సిరగనూరులో 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన మైదానంలో డీపీఐ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యానిదే విజయం' పేరుతో శుక్రవారం సాయంత్రం ఏర్పాటైన మహానాడులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీపీఐ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ మహానాడుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రసంగిస్తూ... తిరుమావళవన్‌కు తనకు మధ్య విడదీయలేని అనుబంధం ఉందని, తమిళ జాతి సంక్షేమం కోసం పాటుపడటమే ఇద్దరి ధ్యేయమన్నారు. అంబేడ్కర్, పెరియార్ ఆశించిన సామాజిక న్యాయంతో కూడిన ద్రావిడతరహా పాలనను అందిస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని, ఇదే తరహా ద్రావిడ పాలన దేశమంతటా రావాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అందరూ స్మరించుకునే రీతిలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చెన్నై లా కాలేజీకి అంబేడ్కర్ పేరు పెట్టారని, తమ ప్రభుత్వం అంబేడ్కర్ జయంతిని సమత్వ దినంగా పాటించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పదేళ్లుగా ప్రజావ్యతిరేక ప్రభుత్వం నడుపుతూ నిరంకుశాధికారం చెలాయిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టి, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడమే ఇండియా కూటమి ప్రధాన ఆశయమని చెప్పారు. ఈ మహానాడులో డీపీఐ చేసిన తీర్మానాలన్నీ కార్యరూపం దాల్చడం తథ్యమన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజల మద్దతు జీరో అన్నారు. బలహీనవర్గాలను, ఎస్సీ ఎస్టీ వర్గాలను కాపాడుకోవాలంటే మూడోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకట్ట వేయడమే జాతీయ నాయకుల బాధ్యత అని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే పార్లమెంటులో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఉండవని, సస్పెన్షన్‌లు, డిస్మిస్‌లు మాత్రమే ఉంటాయన్నారు. జమ్మూకశ్మీర్ యూనియన్ ప్రదేశాలుగా మారినట్లు అన్ని రాష్ట్రాలన కార్పొరేషన్ స్థాయికి దిగజార్చటం ఖాయమని అన్నారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐఎంఎల్ ప్రధాన కార్యదిర్శ దీపాంకర్ భట్టాచార్య, ద్రవిడ కళగం నేత కె.వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొయుద్దీన్, మనిద నేయ మక్కల్ కట్చి నాయకుడు జవాహిరుల్లా, తమిళగ వాళ్వురిమై కట్చి నేత వేల్ మురుగన్, కొంగునాడు మక్కల్ కట్చి అధ్యక్షుడు ఈశ్వరన్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వశీకరన్, రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

33 తీర్మానాలు...

ఈ మహానాడులో పరువు హత్యలు నిరోధించేందుకు ప్రత్యేక చట్టం రూపొందించాలని, నీట్ రద్దు చేయాలని, చెన్నైని దేశానికి రెండో రాజధానిగా ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వమే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరపాలని, దేశంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని, ఒకే దేశం ఒకే ఎన్నికల పద్ధతి యోచనను ఉపసంహరించుకోవాలని ప్రతిపాదిస్తూ మొత్తం 33 తీర్మానాలను ఆమోదించారు.

సమాచార ధ్వని

నేడు, రేపు ఈసీఆర్‌లో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, జనవరి 26: స్థానిక కోవలం నుంచి మహాబలిపురం వరకు సైక్లింగ్ పోటీలు జరగనుండడంతో శని, ఆదివారాల్లో ట్రాఫిక్ మార్పులు చేపట్టారు. ఖేలో ఇండియా పోటీలు చెన్నై, కోయంబత్తూర్, మదురై, తిరుచ్చి తదితర నాలుగు నగరాల్లో జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా పురుషులు, మహిళలు పాల్గొనే సైక్లింగ్ పోటీలు కోవలం నుంచి మహాబలిపురం వరకు 27, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. వాహనచోదకులు పూంజేరి, తిరుపోరూర్, కేళంబాక్కం (ఓఎంఆర్) మార్గాన్ని వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నేడు 'కశ్మీర్ శైవం'పై ఉపన్యాసం

ఐసిఎఫ్, జనవరి 26: కంచి మఠం ఆధ్వర్యంలో కశ్మీర్ ఖ్యాతిని వివరించే 97వ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి 'కశ్మీర్ శైవం'పై ప్రత్యేక ఉపన్యాసం జరగనుంది. రాత్రి 7 గంటలకు రచయిత, పరిశోధకులు విజయ్‌హాస్య ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని నేరుగా వీక్షించలేని వారు కంచి కామకోటి యూట్యూబ్ చానల్, టీవీ, ఫేస్‌బుక్, ఎక్స్ పేజీల్లో చూడవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

పెరంబూర్, జనవరి 26: స్థానిక నంగనల్లూర్‌లోని సత్యానంద యోగా సెంటర్‌లో నాలుగు వారాలు ఉచిత యోగా శిక్షణ తరగతులు జరగనున్నాయి. నంగనల్లూర్ లక్ష్మీనగర్ మెయిన్ రోడ్డులోని శ్రీ సుదర్శన్ టెర్రస్ హాలులో ఫిబ్రవరి 3వ తేది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు జరగనున్న ఈ తరగతుల్లో పాల్గొనేందుకు నెం.9841227709, 9445051015లలో సంప్రదించవచ్చు.

నేడు వైద్య విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

పెరంబూర్, జనవరి 26: తమిళనాడు ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయ 36వ స్నాతకోత్సవం ఈనెల 27న శనివారం జరగనుంది. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఆర్ఎన్ రవి అధ్యక్షతన జరగనున్న ఈ వేడుకలకు, పుదుచ్చేరి జిప్మర్ వైద్యకళాశాల డైరెక్టర్ రాజేష్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, వర్శిటీ ఉపకులపతి కె.నారాయణ స్వామి, రిజిస్ట్రార్ అశ్వత్ నారాయణన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా మొత్తం 29,685 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. వేడుకల్లో గవర్నర్ 134 మందికి డిగ్రీలు అందజేయనున్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయులకు రూ.2,500 వేతనం పెంపు

పెరంబూర్, జనవరి 26: వేతన పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో పార్ట్‌టైం ఉపాధ్యాయులు పలు రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నారు. 2012 అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పీటీ, టైలరింగ్, మ్యూజిక్ తదితరాలకు 12 వేల మంది పార్ట్‌టైం ఉపాధ్యాయులను నెలకు రూ.5,000 వేతనంతో నియమించారు. అనంతరం 2014లో రూ.2,000, 2017లో రూ.700 అని వీరికి వేతనం పెంచారు. అలాగే, 2021 అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మరో రూ.2,300 పెంచి, పార్ట్ టైం ఉపాధ్యాయుల వేతనం నెలకు రూ.10,000 చేరుకుంది. ఈ క్రమంలో, వేతన పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో పార్ట్‌టైం ఉపాధ్యాయులు కొంతకాలంగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈ క్రమంలో, పాఠశాల విద్యాశాఖ ఆధీనంలో పనిచేస్తున్న 12,105 మంది పార్ట్‌టైం ఉపాధ్యాయులకు మరో రూ.2,500 పెంచుతూ రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది.

ఎంటీసీలో డిజిటల్ టికెట్ పరికరాలు

ఐసిఎఫ్, జనవరి 26: అత్యాధునిక డిజిటల్ టికెట్ పరికరాలను ఎంటీసీలో త్వరలో పరిచయం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ రవాణా సంస్థల్లో ప్రయాణికులకు టికెట్లు అందజేసేలా ప్రత్యేక పరికరాలు కొన్నేళ్ల క్రితమే అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాల ద్వారా అందజేసే టికెట్ వివరాలు, వసూలైన మొత్తం ఎప్పటికప్పుడు డిపో, మండల కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాల్లో ఉన్న అధికారులు తెలుసుకొనేవారు. ఈ పరికరాలు మరమ్మతులకు గురికావడంతో వాటి స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రవాణా సంస్థలు నిర్ణయించాయి. త్వరలో అందుబాటులోకి రానున్న అత్యాధునిక డిజిటల్ టికెట్ పరికరాల్లో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కూడా టికెట్లు పొందే సౌకర్యం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

పశువులకు లైసెన్స్ తప్పనిసరి

ఐసిఎఫ్, జనవరి 26: పశువులకు లైసెన్స్‌లు తప్పనిసరిగా పొందాలని సంరక్షకులకు కార్పొరేషన్ హెచ్చరికలు జారీ చేసింది. నగరంలో సంచరించే పశువుల వల్ల ఏర్పడే సమస్యలు పరిష్కరించేలా వాటిని రోడ్లపై వదిలే యజమానులకు జరిమానా విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పెంపుడు శునకాలు, పిల్లులకు తదితరాలకు లైసెన్స్ పొందుతున్నట్లు పశువులకు కూడా లైసెన్స్ పొందాలని చెన్నై కార్పొరేషన్ ఆదేశాలు జారీచేసింది.

ఉపాధ్యాయుల నియమాకాలకు టైంటేబుల్

ఐసిఎఫ్, జనవరి 26: టీఆర్బీ ద్వారా డిగ్రీ టీచర్ పోస్టుల నియామకాలకు సంబంధించిన టైంటేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమరగురుపరన్ విడుదల చేశారు. డిగ్రీ టీచర్ అదనపు పోస్టులు మే 1వ తేది లోపు గుర్తించి ఉపాధ్యాయులు అవసరమున్న పాఠశాలలకు మే 31లోపు బదిలీ చేయాలని సూచించారు. అన్నిరకాల టీచర్ల జనరల్ బదిలీ కౌన్సెలింగ్ జూన్ 30వ తేది లోపు నిర్వహించాలని తెలిపారు. బదిలీలు, నియామకాలకు సంబంధించిన అభిప్రాయాలు జూలై 15వ తేదిలోపు తెలియజేస్తే, వాటిపై సెప్టెంబరు 30వ తేదిలోపు ప్రభుత్వం వివరణ ఇస్తుందని పేర్కొన్నారు.

29న పీఎఫ్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జనవరి 26: కార్మికుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో చెన్నై సహా 10 ప్రాంతాల్లో ఈ నెల 29వ తేది ప్రత్యేక శిబిరాలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు తమిళనాడు, పుదుచ్చేరిలలో 10 ప్రాంతాల్లో శిబిరాలు జరగనుండగా, చెన్నైలో ఎగ్మూర్ పార్తిబన్ రోడ్డులో ఉన్న తమిళనాడు ఎయిడ్స్ నియంత్రణ సంఘం ప్రాంగణం, తిరువళ్లూర్‌లో గుమ్మిడిపూండి సుందరం లిమిటెడ్ సంస్థ, కాంచీపురంలో శ్రీపెరుంబుదూర్ ఎలివేటెడ్ ఇండియా ప్రైవేటు సంస్థ, చెంగల్పట్టులో తిరుముడివాక్కం ఎస్టేట్‌లో జరగనున్నాయి. ఈ శిబిరాల్లో పింఛన్‌దారులు, చందాదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

'క్యూట్' దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, జనవరి 26: కేంద్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సుల ప్రవేశానికి 'క్యూట్' ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. రాబోయే విద్యా సంవత్సరం పీజీ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో, దరఖాస్తు సమర్పణ గడువు ఈనెల 31వ తేది వరకు పొడిగించినట్లు, మరిన్ని వివరాలకు pgcuet.samarth.ac.in అనే వెబ్‌సైట్ సంప్రదించాలని జాతీయ పరీక్షా ఏజెన్సీ తెలిపింది.

స్కూలు కోసం రూ.7 కోట్ల స్థల దానం

పూర్ణం అమ్మాళ్‌కు సీఎం ప్రత్యేక అవార్డు

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతులు నిర్మించేందుకు రూ.7కోట్ల విలువైన స్థలాన్ని దానంగా ఇచ్చిన మదురై సర్వేయర్ కాలనీకి చెందిన ఆయి అమ్మాళ్ అలియాస్ పూర్ణం అమ్మాళ్‌ను గణతంత్ర వేడుకల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘనంగా సత్కరించారు. పూర్ణం అమ్మాళ్ మదురై తల్లాకుళం కెనరాబ్యాంక్‌లో రైటర్. ఆమె భర్త ఆ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూ 1991లో మృతి చెందారు. దీనితో పూర్ణం అమ్మాళ్‌కు కారుణ్య ప్రాతిపదికన ఆ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో రెండు నెలలకు ముందు ఆమె కుమార్తె జనని కూడా మృతి చెందింది. జనని బతికున్నప్పుడు స్కూలు విద్యార్థులు, దివ్యాంగులకు సాయపడుతుండేది. ఆ నేపథ్యంలో పూర్ణం అమ్మాళ్ మదురై జిల్లా కొట్టికుళం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలకు చేరువగా ఉన్న రూ.7 కోట్ల విలువైన 1.52 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ గణతంత్ర వేడుకల్లో ఆమెను ఘనంగా సత్కరించనున్నట్లు ప్రకటించారు.


ఆయి అమ్మాళ్ అలియాస్ పూర్ణం అమ్మాళ్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్





గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ - నృత్య ప్రదర్శనలో చిన్నారులు - నారాయణి ఆసుపత్రిలో జెండా ఎగురవేస్తున్న డాక్టర్ బాలాజీ - నరువి ఆసుపత్రిలో జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న జీవీ సంపత్

ఘనంగా గణతంత్ర వేడుకలు

వేలూరు, జనవరి 26: జిల్లాలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్, కొన్ని సెంటర్లలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. నేతాజీ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్, పోలీసు, విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మేయర్ సుజాత, డీఐజీ సరోజ్‌కుమార్ ఠాగూర్, ఎస్పీ మణివన్నన్, జిల్లా అటవీ శాఖ అధికారి కళానిధి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, సబ్ కలెక్టర్లు రామచంద్రన్, సుమతి, సీత సహా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వేలప్పాడి ద్రౌపది అమ్మవారి ఆలయంలో జరిగిన సహపంక్తి భోజనాల్లోఎమ్మెల్యే కార్తికేయన్, కలెక్టర్, ఆదిద్రావిడుదల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్ పాల్గొన్నారు.

నారాయణి ఆసుపత్రిలో...

శ్రీపురం నారాయణి ఆసుపత్రిలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్, శ్రీ శక్తి అమ్మ భక్తులు మెయ్యప్ప చెట్టియార్, హానీకోసెస్, ఆసుపత్రి డైరెక్టర్ గీతా ఇనియన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాట్పాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

కాట్పాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు జనార్దనన్, కార్పొరేషన్ 9వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత వన్నియరాజా జాతీయ పతాకం ఎగురవేశారు. కౌన్సిలర్లు చిత్ర, మహేంద్రన్, పాఠశాల మేనేజింగ్ కమిటీ అధ్యక్షురాలు విమల, ఉపాధ్యాయులు గౌతమి, కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు మారిముత్తు తదితరులు పాల్గొన్నారు.

నరువి ఆసుపత్రిలో...

స్థానిక నరువి ఆసుపత్రిలో ఆసుపత్రి అధ్యక్షుడు జీవీ సంపత్ జాతీయ పతాకం ఎగురవేశారు. ఆసుపత్రి ఉపాధ్యక్షురాలు అనిత సంపత్, నిర్వాహక డైరెక్టర్ డాక్టర్ పాల్‌హెన్రీ, వైద్యసేవల అధ్యక్షుడు అరవింద్ నాయర్, వైద్యశాఖ సూపరింటెండెంట్ జాకబ్ జోస్, ప్రధాన నిర్వాహక అధికారి మణిమారన్, జీఎం నితీష్ సంపత్, ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఐటీలో 29వ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేలూరు, జనవరి 26: స్థానిక కాట్పాడిలో ఉన్న వీఐటీ యూనివర్శిటీలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి వర్శిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, మాజీ డీజీపీ శైలేంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను శైలేంద్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్, సెల్వం, వైస్, ప్రొ చాన్సలర్ కాదంబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలేంద్రబాబు మాట్లాడుతూ... విద్యలో రాణించాలన్నారు. గతంలో ఉన్నత విద్య అభ్యసించే మహిళల సంఖ్య తక్కువగా ఉండేదని, ప్రస్తుతం వారు కూడా రాణిస్తున్నారన్నారు.


ముఖ్యఅతిథిని సత్కరిస్తున్నవీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్


శ్రీరామ జన్మభూమి క్షేత్ర ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా చెన్నై టీటీడీ ఆలయంలో శుక్రవారం ఉదయం గాత్ర కచేరీ, భజన నిర్వహించిన కొళత్తూరుకు చెందిన శ్రీవెంకటాద్రి భజన సమాజం కళాకారులు, నిర్వాహకులను సత్కరిస్తున్న స్థానిక సలహా మండలి సభ్యులు బి.మోహన్‌రావు, వి.రాధాకృష్ణ తదితరులు


చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో శుక్రవారం సాయంత్రం సాయంత్రం గాత్రకచేరీ చేసిన డాక్టర్ వీఎల్ సుందర్శన్ బృందాన్ని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు అనిల్‌కుమార్ రెడ్డి, కృష్ణారావు, మోహన్‌రావు తదితరులు

అల్ఫా కేర్ హాస్పిటల్‌లో 'షార్ట్ స్టే సర్జరీ'

అడయార్, జనవరి 26: స్థానిక కీల్పాక్కంలోని ఆల్ఫా కేర్ హాస్పిటల్‌తో పాటు ఇందులో కొత్తగా ప్రవేశపెట్టిన సరికొత్త వైద్య చికిత్స విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రధాన కార్యదర్శి తెన్‌కాశి జవహర్, చెన్నై కార్పొరేషన్ కమిషన్ జె.రాధాకృష్ణన్ సంయుక్తంగా ప్రారంభించారు. 'మల్టీ షార్ట్ స్టే సర్జరీ' పేరుతో ఈ కొత్త చికిత్సా విధానాన్ని ఈ ఆసుపత్రి పరిచయం చేసింది. ఈ సందర్భంగా పలు ఆరోగ్య పరీక్షలు, డయాగ్నోస్టిక్ సర్వీసెస్‌ను కేవలం రూ.299కే చేయించుకునే ఆఫర్‌ను ఈనెల 27వ తేదీ వరకు కల్పించారు. హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బాబు నారాయణన్, మేనేజింగ్ డైరెక్టర్ జె.అడెల్ మాట్లాడుతూ... ఈ యేడాది ఆఖరు నాటికి ఆల్ఫా హాస్పిటల్ తరహాలో మరో రెండు ఆస్పత్రులను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం తమ ఆస్పత్రిలో 40 పడకలు ఉన్నాయని, ఈ యేడాది ఆఖరునాటికి ఈ సంఖ్యను 200కు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీసీసీ కమిషనర్ జె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, 'వ్యాధులు రాకముందే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దేశ వైద్య రంగానికి చెన్నై మెడికల్ హబ్‌గా ఉందన్నారు. జవహర్ మాట్లాడుతూ, 'షార్ట్ స్టే సర్జరీ' వైద్య విధానానికి ప్రభుత్వంనుంచి కూడా తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.


అల్ఫా కేర్ ఆస్పత్రి ప్రారంభోత్సవ దృశ్యం

'పద్మభూషణ్' పురస్కారం కార్యకర్తలకు అంకితం

డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, జనవరి 26: దివంగత పార్టీ అధ్యక్షుడు విజయకాంత్‌ను గౌరవిస్తూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'పద్మభూషణ్' పురస్కారం కార్యకర్తలకు అంకితమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. కోయంబేడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ... విజయకాంత్ జీవించి ఉన్న సమయంలో పురస్కారం ప్రకటించినట్లయితే బాగుండేదన్నారు. అదే సమయంలో ఆయన జీవించిన ఉంటే ఆ పురస్కారం ప్రదానం కుటుంబసభ్యులు, పార్టీ కార్యకర్తలు సంతోషంగా వేడుకగా జరుపుకొనే ఉండేవారమన్నారు. ఆయన మృతి చెందిన 30 రోజుల తర్వాత కేంద్రప్రభుత్వం పురస్కారం ప్రకటించిందని, ఈ పురస్కారం కార్యకర్తలకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. భవదారణి మృతి తీరని లోటన్నారు. చిన్నతనం నుంచే తాను ఆమెను చూశానని, ఇకపై ఆమె గొంతు వినిపించదు అనే వార్త జీర్ణించుకోలేకపోతున్నానని ప్రేమలత తెలిపారు.

డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలికి రిమాండ్

పెరంబూర్, జనవరి 26: ఇంట్లో పనిచేస్తున్న బాలికను చిత్రహింసలు చేపట్టిన వ్యవహారంలో డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలికి ఫిబ్రవరి 9వ తేది వరకు కోర్టు రిమాండ్ విధించింది. పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడు ఆంద్రో మదివానన్, కోడలు మెర్లినా... తిరువాన్మియూర్ సౌత్ అవెన్యూ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తుండగా, ఇంట్లో పనుల కోసం తీసుకొచ్చిన రేఖ అనే 18 ఏళ్ల బాలికను చిత్రహింసలు పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై బాధిత బాలిక ఫిర్యాదుతో ఆరుసెక్షన్ల కింద కేసునమోదు చేసిన నీలాంగరై మహిళా పోలీసులు, ఆంధ్రరాష్ట్రంలో తలదాచుకున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిని శుక్రవారం ఉదయం చెన్నైకి తీసుకొచ్చి ఎగ్మూర్‌లోని న్యాయమూర్తుల క్వార్టర్స్‌లోని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, వారిద్దరికి ఫిబ్రవరి 9వతేది వరకు రిమాండ్ విధించడంతో వారికి జైలుకు తరలించారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు

● ఏకంగా ఇంటికి శిలాఫలకం ఏర్పాటు

పెరంబూర్, జనవరి 26: నోటుకు ఓటు అమ్ముకోవడం చట్టపరంగా నేరం అని మదురైకి చెందిన సంఘ శ్రేయోభిలాషి తన ఇంటికి శిలాఫలకం ఏర్పాటు చేశారు. మదురై సెల్లూరు కల్యాణ సుందరంపురం పూందమల్లి నగర్‌కు చెందిన శంకరపాండ్యన్ (38) టైల్స్ అమర్చే వృత్తి చేస్తున్నాడు. సమాజసేవలో భాగస్వామ్యులవుతున్న శంకర పాండ్యన్, జలవనరులను కాపాడుకుందాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం సహా అనేక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రానున్న పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఓటు ప్రాధాన్యం ప్రజలకు వివరించేలా సరికొత్త అవగాహన చేపట్టాడు. 'నోటుకు ఓటు అమ్ముకోవడం చట్టపరంగా నేరం' అనే శిలాఫలకాన్ని తన ఇంటి ముందు ఏర్పాటు చేశాడు. అదే సమయంలో ఆయన గతంలో ఉప ఎన్నికలతో పాటు నాలుగు సార్లు పోటీచేశాడు. చివరగా, మదురై కార్పొరేషన్ ఎన్నికల్లో 265 ఓట్లు పొందాడు. ఎన్నికల్లో గెలుపు తన లక్ష్యం కాదని, ప్రజలకు ఓటు విలువ తెలియజేయడమే తన లక్ష్యమని శంకరపాండ్యన్ తెలిపారు.


శిలాఫలకంతో శంకరపాండ్యన్

అందరూ న్యాయబద్ధమైన జీవనం సాగించాలి

● హైకోర్టు న్యాయమూర్తి పీబీ బాలాజి


శ్రీవారి పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి పీబీ బాలాజి, నిర్వాహకులు బోడి శ్రీనివాసులు, ఎస్.రవిచంద్రన్ తదితరులు

ప్యారీస్, జనవరి 26: సమాజంలో అందరూ న్యాయంగా నడవాలని, విశ్వసనీయతను ప్రేమించాలని, దైవంతో కలసి నడవాలని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి పీబీ బాలాజి హితవు పలికారు. కొడుంగైయూర్ వెంకటేశ్వరనగర్‌లోని సిద్ధి వినాయక శ్రీనివాస వేంకటముడయాన్ తిరుకోయిల్ సేవార్థిగళ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 22వ వార్షిక తిరుమల పాదయాత్ర సందర్భంగా ఉభయదేవేరుల సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెలరోజులు ఉపవాసం చేపట్టిన 200 మందికి పైగా భక్తులు పాల్గొన్న తిరుమల పాదయాత్రను జస్టిస్ పీబీ బాలాజి ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు బోడి శ్రీనివాసులు, మన్నా హెల్త్ డ్రింక్ లీగల్ అడ్వైజర్ ఎస్.రవిచంద్రన్, బీవీఆర్ భాస్కర్, బీహెచ్ శ్రీనివాస, కె.భావనారాయణ సహా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు సమయం కేటాయించండి

● కమల హాసన్

పెరంబూర్, జనవరి 26: ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు సమయం కేటాయించాలని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ పిలుపునిచ్చారు. గతంలో పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో 73 శాతం ఓట్లు నమోదయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇది మరింత తగ్గే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారన్నారు. విద్య, వైద్య, ఉపాధి, అభివృద్ధి రంగాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఓటు ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా యంత్రంగా మారిన రోజువారీ జీవితంలో, ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు సమయం కేటాయించాలని కమల్ విజ్ఞప్తి చేశారు.

గవర్నర్ తేనీటి విందుకు మంత్రుల హాజరు


ఎట్ హోం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారితో గవర్నర్

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక గిండిలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ రవి శుక్రవారం తేనీటి విందు అందజేశారు. ఈ వేడుకల్లో రాష్ట్రప్రభుత్వం తరఫున మంత్రులు తంగం తెన్నరసు, ఎం.సుబ్రమణ్యం, రఘుపతి, అన్బరసన్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రతిపక్ష అన్నాడీఎంకే నుంచి మాజీ మంత్రి డి.జయకుమార్, బాలగంగా, బీజేపీ తరఫున కరు.నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా, గవర్నర్ తేనీటి విందును డీఎంకే కూటమి పార్టీలు బహిష్కరించిన విషయం తెలిసిందే.

జీఎన్ఎస్‌లో జాతీయ బాలికల దినోత్సవం



అడయార్, జనవరి 26: స్థానిక వేళచ్చేరిలోని "ఐఎస్ఓ 9001: 2015" సర్టిఫికెట్ గుర్తింపు పొందిన గురునానక్ మెట్రిక్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీన్ని పురస్కరించుకుని 'చెన్నై కౌర్' పేరుతో బాలికల కోసం ఇంటర్‌స్కూల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించింది. ఇందులో 18 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వాలీబాల్ ఆటగాడు జి.దినకరన్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. మొదటి బహుమతిని లేడీ శివస్వామి అయ్యర్ బాలికల హైయ్యర్ సెకండరీ స్కూల్ గెలుచుకుంది. అలాగే, రన్నరప్‌గా రాణి మెయ్యమ్మై హయ్యర్ సెకండరీ స్కూల్, మూడో బహుమతిని ఆవడి ప్రభుత్వం హయ్యర్ సెకండరీ పాఠశాల, నాలుగో బహుమతిని కన్నగి నగర్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల బాలికల జట్టు నిలిచింది.

భవతారిణికి సినీ ప్రముఖుల నివాళి

నేడు అంత్యక్రియలు

అడయార్, జనవరి 26: కాలేయ క్యాన్సర్ కారణంగా మృతి చెందిన సంగీత దర్శకుడు ఇళయరాజా కుమార్తె, సినీ సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని భవతారిణి పార్థివదేహాన్ని శుక్రవారం శ్రీలంక నుంచి విమానంలో చెన్నైకు తీసుకొచ్చారు. సంగీత దర్శకుడు, సోదరుడు యువన్ శంకర్ రాజా, సినీ దర్శకుడు వెంకట్ ప్రభు ఎయిర్‌పోర్టు నుంచి టి.నగర్‌లోని మురుగేశన్ వీధిలో ఉన్న ఇళయరాజా నివాసానికి పార్థివదేహాన్ని తీసుకొచ్చి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు కడచూపు కోసం ఉంచారు. అనంతరం సొంతూరు తేని జిల్లాలోని పన్నైపురంకు తరలించి, అక్కడ శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు సమాచారం. కాగా, భవతారిణి మృతిపట్ల మంత్రి, సినీ నటుడు ఉదయనిధి , హీరోలు శింబు, సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్, దర్శకుడు సుశీంద్రన్, సీనియర్ హీరో, దర్శక నిర్మాత టి.రాజేందర్, దర్శక శిఖరం భారతీరాజా, సంగీత దర్శకుడు దీనా తదితరులు తమ ప్రగాఢ సంతాపాలను ట్విటర్ వేదికగా వెల్లడించారు. 'భవతారిణి మృతి ఎంతో దుఃఖానికి గురిచేసిందని, ఇళయరాజాకు ఫోనులో సంతాపాన్ని తెలిపా'ను అని రజనీకాంత్ ట్వీట్ చేశారు. 'జీర్ణించుకోలేని వార్త. నా ప్రియ సోదరుడు ఇళయరాజాను ఓదార్చేందుకు ఏం చేయాలో తెలియడం లేదు. భవతారిణి మృతి ఏమాత్రం జీర్ణించుకోలేనిది. ఈ విషాదకర సమయంలో ఇళయరాజా మనోధైర్యాన్ని కోల్పోరాదు. భవతారిణి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. సంతాపం' తెలుపుతున్నాను అని కమల్ ట్వీట్ చేశారు. హీరో విశాల్ తన సంతాప సందేశంలో 'బరువెక్కిన హృదయంతో భవతా ఇక లేరని విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నాను. ఇళయరాజా కుమార్తెగా, యువన్ సోదరిగా, వాసుకి కజిన్‌గా కంటే నా సొంత సోదరిని కోల్పోయాను. ఈ దుఃఖసాగరం నుంచి మీ కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, ఇళయరాజా కూడా తన కుమార్తె మృతిపట్ల శుక్రవారం 'ఎక్స్' వేదికగా 'అన్బు మగలే' (ప్రియమైన కూతురా...) అంటూ ట్వీట్ చేశారు. సీనియర్ నటులు శివకుమార్, రామరాజన్, హీరోలు కార్తీ, విజయ్ ఆంటోని, నిర్మాత ఆర్బీ చౌదరి, దర్శకుడు మనోజ్ భారతీరాజా, నటుడు ఆనంద్‌రాజ్, నటి కుట్టిపద్మిని, జయం రాజా, సంగీత దర్శకుడు భరద్వాజ్ తదితరులు భవతారిణికి నివాళి అర్పించారు.


భవతారిణి పార్థివదేహం వద్ద విషాదవదనంలో కుటుంబీకులు






చెన్నై ఐసీఎఫ్ స్టేడియంలో జరిగిన గణతంత్రదిన వేడుకల్లో జెండా వందనం చేస్తున్న ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ బీజీ మాల్యా - గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన గవర్నర్ ఆర్ఎన్ రవికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - గణతంత్ర వేడుకల్లో త్రివిధ దళాధికారులతో గవర్నర్ కరచాలనం - రిప్పన్‌భవనం ఎదుట గణతంత్ర వేడుకల్లో ఎన్‌సీసీ కెడెట్లకు సెల్యూట్ చేస్తున్న మేయర్ ఆర్. ప్రియ



తూత్తుకుడి మత్స్యకళాశాలలో గణతంత్ర వేడుకల్లో సందేశమిస్తున్న డీన్ డాక్టర్ బీ అఖిలన్



పెరంబూరులోని రైల్వే స్టేడియంలో జరిగిన వేడుకల్లో పతాకావిష్కరణ చేస్తున్న దక్షిణరైల్వే జీఎం ఆర్ఎస్ సింగ్. అదనపు జనరల్ మేనేజర్ కౌశల్ కిశోర్ తదితరులు కూడా పాల్గొన్నారు.



చెన్నై పోరూరులో వున్న శ్రీరామచంద్ర మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చిలో పతాకావిష్కరణ చేస్తున్న వర్శిటీ ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం



సీఎండీఏలో జరిగిన వేడుకల్లో జెండావందనం చేస్తున్న కమిటీ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు



అన్నాడీఎంకే యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జాతీయపతాకం ఎగురవేయడంతో పాటు ప్రపంచ శాంతి కోసం తెల్లపావురాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి 'ఐవిట్‌నెస్' ఛానల్ అధినేత రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, పేదలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

● రాజ్యాంగ స్మరణలో రాష్ట్రం

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రం మువ్వెన్నెల పతాకాల రెపరెపలతో మురిసిపోయింది. ఎక్కడా చూసినా జెండా పండుగ సంబరాలు కనిపించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు అందంగా ముస్తాబు చేసి ఆయా కార్యాలయాలు, సంస్థల ప్రతినిధులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.



రైల్వేస్టేడియంలో రైల్వేదళం విన్యాసాలు

మద్రాసు హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి సంజయ్ గంగాపూర్ వాలా తమిళ సంప్రదాయిక దుస్తులైన ధోవతి, పట్టుచొక్కా ధరించి గణతంత్ర వేడుకలకు హాజరయ్యారు. త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం సభ్యులు కవాతును తిలకించారు. ఈ వేడుకల్లో న్యాయశాఖ మంత్రి రఘుపతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, డీజీపీ శంకర్‌జివాల్, నగర పోలీసు కమిషనర్ సదీప్‌రాయ్ రాథోడ్, న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...

కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్‌భవంతి ప్రాంగణంలో మేయర్ ఆర్ ప్రియ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్పొరేషన్ పాఠశాలల ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కవాతును తిలకించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన కార్పొరేషన్ ఉద్యోగులకు మేయర్ ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు.

ఆడిటింగ్ జనరల్ ఆఫీసులో...

స్థానిక అన్నాసాలైలోని కంప్ట్రోలర్ ఆఫ్ ఆడిటింగ్ జనరల్ ఆఫీసులో గణతంత్ర వేడుకలలో ప్రిన్సిపల్ ఆడిటింగ్ జనరల్ డి.కే శేఖర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యాలయం ఉన్నతాధికారులు రాజేంద్రన్, రేవతి, అనిల్ చెరియన్, నెడుంజెళియన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీఐలో...

మెరీనాబీచ్ కామరాజర్ సాలైలోని రిజర్వు బ్యాంక్ కార్యాలయలో ప్రాంతీయ అధికారి ఉమా శంకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశా. ఆ సందర్భంగా విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే విధంగా నుంగంబాక్కంలోని ఆదాయపు పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో చీఫ్ కమిషనర్ సునీల్‌మాథూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో...

పెరంబూరు రైల్వే మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ ఎస్ సింగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర నగర శివారు ప్రాంతాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కార్తికేయన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సంస్థ అధికారులు షణ్ముగసుందరం తదితరులు పాల్గొన్నారు.

న్యూవాషర్‌మెన్ పేట శ్రీబాబూ జగ్జీవన్‌రామ్ మైదానంలో మద్రాసు పోర్ట్ ట్రస్టు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పోర్ట్ ట్రస్టు ఛైర్మన్ సునీల్ పాలీవాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోర్ట్ ట్రస్టు ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కీల్పాక్‌లో ఉన్న ఎన్ఎల్‌సీ రీజనల్ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న కంపెనీ సెక్రటరీ ఉదయశంకర్. ఈ సందర్భంగా ఎన్ఎల్‌సీ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లి పంపించిన సందేశాన్ని చదివి వినిపించారు

కస్టమ్స్‌హౌస్‌లో...

హార్బర్ నియోజకవర్గంలోని చెన్నై కస్టమ్స్ హౌస్‌లో చీఫ్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ డాక్టర్ ఆర్ రామ్‌నివాస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులను ప్రశంసించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన బ్యాండ్ బృందం సభ్యులు, ఇతర కళాకారులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు.

పల్లవన్‌హౌస్‌లో...

మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) ఆధ్వర్యంలో పల్లవన్‌హౌస్‌లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆల్బీ జాన్ జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కోయంబేడు వద్దనున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎన్నికల కమిషనర్ పళనికుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసు దళం సభ్యులు కవాతును తిలకించారు. ఈ వేడుకల్లో ఎన్నికల సంఘం కార్యదర్శి రత్నా తదితరులు పాల్గొన్నారు. కోయంబేడులోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆ సంస్థ అధ్యక్షుడు పూచ్చి మురుగన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శరవణవేల్‌రాజ్, కార్యదర్శి వరశనమూర్తి, చీఫ్ ఇంజనీర్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన మెరీనా

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గణతంత్రదిన వేడుకల సందర్భంగా మెరీనా మురిసిపోయింది. భారీగా తరలివచ్చిన జనసందోహం, పోలీసుల కవాతు, శకటాల టకటకలు, కళాకారుల నృత్య హేళితో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేగాక ఆ మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లించారు.



విద్యార్థినులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న టామ్స్ దక్షిణ జిల్లా అధ్యక్షుడు రొడ్డా జైరాజ్ తదితరులు



ఎంసీటీబీసీ ప్రాంగణంలో జెండా ఆవిష్కరిస్తున్న పాస్టర్ రాజేంద్రప్రసాద్



ఎస్‌కేపీడీ గణతంత్ర వేడుకల్లో అతిథి బాలసుబ్రమణియన్‌కు మొక్కలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



సదరన్ ఇండియా వైశ్య సంఘంలో ముఖ్యఅతిథి లయన్.వెంకటరమణను సత్కరిస్తున్న నిర్వాహకులు



జెండా వందనం చేస్తున్న వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై నిర్వాహకులు

తెలుగు లోగిళ్లలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

ప్యారీస్,జనవరి 26: గ్రేటర్ చెన్నైలోని తెలుగు సంఘాలు, కళాశాల, పాఠశాలల్లో శుక్రవారం 75వ గణతంత్రదిన సంబరాలు కనువిందు చేశాయి. తెలుగు వారుండే ప్రాంతాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. మువ్వెన్నెల జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ, సీనియర్ సిటిజన్లకు సత్కారం తదితర కార్యక్రమాలతో తెలుగు లోగిళ్లు సందడి చేశాయి.

చెన్నపురి అన్నదాన సమాజం...

పార్క్‌టౌన్‌లోని చెన్నపురి అన్నదాన సమాజంలో వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్‌ల అధ్యక్షులు చీమకుర్తి మల్లికార్జునరావు-నాగలక్ష్మి, కార్యదర్శులు త్రిలోక్‌బాబు-పూర్ణిమ, ట్రెజరర్లు ప్రవీణ్‌కుమార్-శివరంజిని నేతృత్వంలో అనాథ పిల్లలు జెండా ఆవిష్కరించగా, క్లబ్‌ల సభ్యులందరూ జెండా వందనం చేశారు. డీపీఓ ముంజులూరు చంద్రకళ, ఆర్సీ ముంజులూరు మురళీమోహన్, జెడ్సీ ఎస్వీ పద్మనాభన్, సభ్యులు పిల్లలకు నోటు పుస్తకాలు, పండ్లు, తిరుపతి లడ్డూ ప్రసాదం, అల్పాహారం పంపిణీ చేశారు.

ఎంసీటీబీసీలో...

వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘం (ఎంసీటీబీసీ) ప్రాంగణంలో సంఘకాపరి ఎస్.రాజేంద్రప్రసాద్ జెండా ఆవిష్కరించారు. స్త్రీల సమాజం అధ్యక్షురాలు సౌపాటి దానమ్మ, అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ ఎ.బాబు, ఈసీ సభ్యులు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్ నిర్వాహకులు పాల్గొని జెండా వందనం చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉదయం 10 గంటలకు స్త్రీల రిట్రీట్ కార్యక్రమం ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు సాగింది. నెల్లూరుకు చెందిన పి.మార్తా సంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దైవసందేశం అందించారు.



పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జెండా ఆవిష్కరిస్తున్న కృష్ణారావు

సదరన్ ఇండియా వైశ్య సంఘం...

ప్యారీస్ గిడ్డంగి వీధిలో 119 ఏళ్ల చరిత్ర కలిగిన సదరన్ ఇండియా వైశ్య సంఘంలో అధ్యక్షుడు అజంతా కంపెనీ అధినేత కనిగెలుపుల శంకరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సుగుణ విలాస్ సభ ఉపాధ్యక్షులు లయన్ ఎస్వీ వెంకటరమణ జెండా ఆవిష్కరించారు. సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్, కోశాధికారి పెసల రమేష్, ఉపాధ్యక్షులు ఎం.కాశీవిశ్వనాథం, జీపీపీ సుబ్బారావు, మన్నారు ఉదయకుమార్, వివిధ కమిటీల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

టామ్స్ ఆధ్వర్యంలో...

తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) ఆధ్వర్యంలో సైదాపేట, వేళచ్చేరి, ట్రిప్లికేన్, ఆవడి, పల్లావరం, అంబత్తూర్ ప్రాంతాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. 186వ వార్డులో టామ్స్ దక్షిణ చెన్నై అధ్యక్షుడు రొడ్డా జైరాజ్ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో టామ్స్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షుడు నేలటూరు విజయకుమార్, కౌన్సిలర్ సమీనా సెల్వం, సుబ్బయ్య, సుబ్రమణి, రంజిత్‌కుమార్, సెల్వవినాయగం, నాగరాజ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనంలో...

మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహ కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కమిటీ కార్యదర్శి, కోశాధికారి ఒంటెల కృష్ణారావు జెండా ఆవిష్కరించగా, సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ, సభ్యులు జేఎం నాయుడు, వ్యాపారవేత్త ఊరా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేపీడీ....

జార్జిటౌన్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో మహర్షి విద్యా మందిర్, ఎస్‌కేపీడీ బాలుర, కేటీసీటీ బాలికల పాఠశాలలు, ఎస్‌కేపీసీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, ఎస్‌కేపీసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహనశ్రీ, డాక్టర్ జేవీ రావు,డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఆర్.బాలసుబ్రమణియన్ పాల్గొని జెండా ఆవిష్కరించి, విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.



చెన్నై ఆవడిలోని ఎస్‌వీటీ మాధ్యమిక పాఠశాలలో జరిగిన గణతంత్రదిన వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జీఎన్ జ్యోతికృష్ణన్, ప్రధానోపాధ్యాయురాలు జీఏ అనిత, విద్యార్థులు



చెన్నై టి.నగర్ కేసరి స్కూల్లో జరిగిన గణతంత్ర దిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ శ్రీరామ్ సౌందరరాజన్‌ను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యక్షుడు రాధాకృష్ణన్

పార్టీ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు



కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సేవాదళ్ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర మైనార్టీల సంఘం అధ్యక్షుడు పీటర్ అల్ఫోన్స్

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రధాన కార్యాలయాలల్లోనూ, ఆ పార్టీ నేతల టధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర మైనార్టీల సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత పీటర్ అల్ఫోన్స్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. సేవాదళ్ కార్యకర్తలకు మిఠాయిలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి, పొన్ కృష్ణమూర్తి, గోపన్నా, ఎస్ఏ వాసు, డాక్టర్ సుమతి అన్బరసు, కుంగ్‌ఫూ విజయన్ తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా అన్నానగర్ శాంతికాలనీలో కాంగ్రెస్ ఎంపీ ఎస్ తిరునావుక్కరసు జాతీయజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరపాండ్యన్, మహేంద్రన్ తమిళ్‌సెల్వన్, కరాటే రవి, మదన్ తదితరులు పాల్గొన్నారు.



టీఎంసీ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్

టీఎంసీ కార్యాలయంలో

తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ ఎంపీ జీకే వాసన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు జీఆర్ వెంకటేష్, శక్తి వడివేల్, సైదై మనోహరన్, అరుణ్‌కుమార్, పి. చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్ఎం ఆఫీసులో

స్థానిక ఆళ్వార్‌పేటలోని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) ప్రధాన కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆ పార్టీ ఉపాధ్యక్షుడు మౌర్యా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆ సందర్భంగా దివ్యాంగులకు మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ కార్యదర్శి సెంథిల్ గణతంత్ర దినం వివరాలను చిన్నారులకు క్లుప్తంగా వివరించారు. పార్టీ ప్రముఖులు పలువురు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఇదే విధంగా పెరుంతలైవర్ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు ఎన్ఆర్ ధనపాలన్, సమత్తువ మక్కల్ కళగం తరఫున ఆ పార్టీ నేత ఎర్నావూరు నారాయణన్ జాతీయ పతాకాలను ఎగురవేశారు.



మక్కల్‌నీదిమయ్యం కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆ పార్టీ ఉపాధ్యక్షుడు మౌర్యా








మెరీనా బీచ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ కళారూపాల్లో నృత్య ప్రదర్శనలు, వివిధ విభాగాలకు చెందిన కవాతు



